ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



చిత్తూరు
జిల్లా వార్తలు
బుధవారం 18 సెప్టెంబరు 2024

100 రోజుల గడువు సమీపిస్తోంది యువ నాయకా!

కూటమి ప్రభుత్వ విజయంలో ఒక కీలక మైలురాయి యువగళం పాదయాత్ర. తొలి అడుగు పడింది ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే. కుప్పంలో 2023 జనవరి 27న మొదలైన నడక దాదాపు ఏడాది పాటు సాగింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అవాంతరాలను అధిగమిస్తూ, వైసీపీ శ్రేణుల బెదిరింపులను ఎదుర్కొంటూ యువగళం సాగింది. ఈ సందర్భంగా ప్రతి వంద కిలోమీటర్లకూ ఒక మైలు రాయిని లోకేష్ ఆవిష్కరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల లోగా అమలు చేస్తామంటూ కొన్ని హామీలు ఇచ్చారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఆరు మైలు రాళ్ల ప్రతిష్ఠాపన జరిగింది. వీటిలో తొలి హామీ బంగారుపాళ్యంలో కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ కేంద్రం నెలకొల్పుతామన్నది. చెప్పినట్టే వంద రోజుల్లోగా ఆ పని చకచకా జరిగిపోతోంది. ఖాళీ ఖజానాతో ప్రభుత్వ పాలన మొదలైనా మాటతప్పరనే నమ్మకాన్ని ఇది కలిగిస్తోంది. దీంతో పాటూ మిగిలిన హామీలు కూడా అమలవుతాయనే భరోసాను ఇస్తోంది. ఈ సందర్భంగా కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు సమీపిస్తున్న వేళ లోకేష్ హామీల వర్తమాన స్థితిని ఆంధ్రజ్యోతి అందిస్తోంది.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● నారా లోకేష్ హామీల స్థితిగతులపై గ్రౌండ్ రిపోర్ట్ ● చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆరు చోట్ల శిలాఫలకాలు



100వ కి.మీ

3ఫిబ్రవరి 2023

బంగారుపాళ్యం శివార్లలో తొలి వందవ కిలోమీటరు మైలు రాయి.

హామీ: ప్రభుత్వం ఏర్పాటైన మొదటి వంద రోజుల్లోపు బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి డయాలసిస్ పరికరాలు అందజేస్తాం.

తొలి హామీ అమలైంది

బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు



బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రి వార్డులో అమర్చిన డయాలసిస్ పరికరాలు

ప్రస్తుత స్థితి: పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని పరిసరాల గ్రామాల్లో కిడ్నీవ్యాధిగ్రస్థులు డయాలసిస్ చేసుకోవాలంటే వ్యయప్రయాసలకోర్చి తిరుపతి, వేలూరు, చిత్తూరు ఆస్పత్రులకు వెళ్ళాల్సివచ్చేది. దీన్ని గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ వినతి మేరకు బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు విన్నవించారు. ఆయన స్పందించి వెంటనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడానికి హామీ ఇచ్చి, అదేరోజు శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. ఇప్పుడది అమలు రూపు దాల్చింది. నారా లోకేష్ అభ్యర్థనతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిష్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్ పథకం కింద ఒక్కోటి రూ. 50 లక్షల విలువ చేసే ఐదు డయాలసిస్ పరికరాలను బంగారుపాళ్యం ఆస్పత్రికి కేటాయించింది. ఇవి పదిహేను రోజుల కిందట ఆస్పత్రికి చేరుకున్నాయి. కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనంలో వీటిని అమర్చుతున్నారు. కొత్త కేంద్రంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సుమారు 30 మంది కిడ్నీ బాధితులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ డయాలసిస్ కేంద్రంలో ప్రత్యేక వైద్యనిపుణులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటూ కిడ్నీ వ్యాధి బాధితులకు డయాలసిస్ సేవలు అందజేయనున్నారు.



నాలాంటి వారికి వరం



ఏడు సంవత్సరాలుగా నేను కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. కుప్పంలోని పీఈఎస్ మెడికల్ కళాశాలలో కొంతకాలం డయాలసిస్ చేసుకున్నా.ప్రస్తుతం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్నా. డయాలసిస్ పేషెంట్‌గా బస్సు ప్రయాణాల్లో నరకం అనుభవిస్తున్నా. నా లాంటి బాధితులకు బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు ఓ వరంలా భావిస్తున్నా. నారా లోకేష్‌కు కృతజ్ఞతలు.

\- రామయ్య, బంగారుపాళ్యం దళితవాడ

సంతోషంగా ఉంది



మా ఇంటికి కూతవేటు దూరంలోనే నారా లోకేష్ చొరవతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటవుతోంది. నేను వారానికి మూడు సార్లు చిత్తూరుకు వెళ్ళి డయాలసిస్ చేసుకుని వస్తుంటా. ఇక ముందు ఈ తిప్పలు ఉండవంటేనే హాయిగా ఉంది. ఇప్పటికే నేను బంగారుపాళ్యం కేంద్రానికి వెళ్ళి పేరు నమోదు చేసుకున్నా.

\- రాజేంద్ర, బంగారుపాళ్యం దళితవాడ

1700వ కి.మీ

21జూన్2023

డక్కిలి మండల కేంద్రంలో శిలాఫలకం.

హామీ: హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్ పార్కు స్థాపిస్తాం.

ప్రస్తుత స్థితి: ఇంకా అమలు ప్రయత్నాలు మొదలు కాలేదు.

ఆక్వాకు ఊరట

1800వ కి.మీ

26 జూన్ 2023

చిట్టమూరు మండలం అరవపాలెంలో శిలాఫలకం.

హామీ: ఆక్వా రంగానికి గతంలో ఇచ్చిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు పునరుద్ధరించి ఆదుకుంటాం.

ప్రస్తుత స్థితి: గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి విద్యుత్ ఛార్జీలు వేర్వేరుగా వసూలు చేసింది. ఆక్వా జోన్‌లో యూనిట్‌కు రూ. 2, నాన్ జోన్‌లో యూనిట్‌కు రూ. 4 నుంచీ రూ. 7 వరకూ వసూలు చేసింది. ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక జోన్లు ఎత్తివేసి అన్ని చోట్లా యూనిట్‌కు రూ. 2 వసూలు చేస్తున్నారు. నారా లోకేష్ హామీల అమలులో భాగంగా ఇదొక ఊరట. అలాగే మిగిలిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై అధ్యయనం చేయాలని లోకేష్ అధికారులను ఆదేశించారు.



చిట్టమూరు మండలం అరవపాలెంలో శిలాఫలకం

200వ కి.మీ

11 ఫిబ్రవరి 2023

కార్వేటినగరం మండలం కత్తిరిపల్లి వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

హామీ: వంద రోజుల్లోనే గంగాధర నెల్లూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: డిగ్రీ కళాశాల ఏర్పాటు దిశగా ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దశాబ్దాలుగా ఈ ప్రాంత విద్యార్థులు డిగ్రీ కోర్సుల కోసం చిత్తూరు, కార్వేటినగరం, పుత్తూరు వెళ్ళాల్సి వస్తోంది. ఇక్కడ కాలేజీ ఏర్పాటైతే పెనుమూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం మండలాల విద్యార్థులకు అనుకూలంగా వుంటుంది.



300వ కి.మీ

19 ఫిబ్రవరి 2023

శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో శిలాఫలకం.

హామీ: తొండమానుపురం కేంద్రంగా చుట్టుపక్కల 13 గ్రామాలకు రక్షిత తాగునీటి పథకం ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

400వ కి.మీ

1 మార్చి 2023

నేండ్రగుంటలో శిలాఫలకం.

హామీ: నేండ్రగుంటలో పది పడకల సామర్థ్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: ఈ దిశగా ఇప్పటి దాకా ఎలాంటి చర్యలూ లేవు. నేండ్రగుంటలో ఎప్పటి నుంచో ఆరోగ్య ఉప కేంద్రం వుంది. ఇది పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వస్తుంది.నేండ్రగుంట, పరిసర గ్రామాల ప్రజలు వైద్య చికిత్స కోసం పాకాల, వి.కొత్తకోట పీహెచ్‌సీలకు గానీ, చంద్రగిరి కమ్యూనిటీ ఆసుపత్రికి గానీ వెళ్లాలి. జాతీయ రహదారిపై వున్న నేండ్రగుంటలో పది పడకల సామర్థ్యంతో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాల వారికే కాకుండా ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలకు కూడా ఉపయోగపడుతుంది.



పాకాల మండలం నేండ్రగుంటలో శిలాఫలకం

మీరే తవ్వుకుంటే ఇసుక ఉచితమే



కలెక్టర్ సుమిత్‌కుమార్

● మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు రూ.20లక్షలతో పనులు ● ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కలెక్టర్

చిత్తూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని వంకల్లో, వాగుల్లో, నదీ ప్రాంతాల్లో ఇసుకను యంత్రాల ద్వారా కాకుండా అవసరమైనవారు సొంతంగా తవ్వుకుని వాడుకోవచ్చని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.నూతన ఇసుక పాలసీ గురువారంనుంచి అమలు కానున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మంగళవారం ఆయన మాట్లాడారు.ఇసుక లభ్యత గురించి వివరించారు.చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసపల్లె, పాలారుతో పాటు బైరెడ్డిపల్లె క్రాస్ వద్ద వున్న స్టాక్ పాయింట్లలో ఇప్పుడు దిగువమాసపల్లె స్టాక్ పాయింట్‌లో 90 వేల టన్నుల ఇసుక మాత్రమే ఉందన్నారు. మిగిలిన రెండు పాయింట్లలో ఇసుక అయిపోయిందని, ఈ పరిస్థితుల్లో తదుపరి ఏం చేయాలనేది ఆలోచిస్తున్నామన్నారు. తిరుపతిలో స్టాక్ పాయింట్ స్టార్ట్ అయితే అక్కడి నుంచి తెచ్చుకోవచ్చన్నారు.

మొగిలి ఘాట్ లోపాల్ని సరిచేస్తాం

మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు జరగడానికి సాంకేతిక లోపాలే కారణమని గుర్తించాం.ఈ ఘాట్‌లో ఎక్కువ స్లోప్ ఉంది. దీంతో దిగువకు వచ్చే భారీ వాహనాలు అదుపు తప్పుతున్నాయి. వెంటనే ఆ స్లోప్‌ను తగ్గించాలి. అలాగే వాహనాలు ఘాట్‌లో దిగేటప్పుడు డ్రైవర్‌కు లిఫ్ట్ సైడ్ వ్యూ తక్కువగా ఉంది. ఈ సమస్యను పరిష్కరిస్తే ప్రమాదాలను చాలావరకూ నివారించవచ్చు. ప్రస్తుతం ఘాట్‌లో బ్లింకర్స్ ఉన్నాయి. కానీ, రోడ్డుకు ఇరువైపులా పెద్ద గుట్టలు ఉండడం వల్ల లైటింగ్ తక్కువగా ఉంది. ఇది కూడా ప్రమాదాలకు కారణం. ఘాట్‌లో పెద్దఎత్తున లైటింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణ కోసం ఎలాంటి పనులు చేయాలనేది పోలీసు, రవాణా శాఖ అధికారులతో చర్చించి నిర్ణయానికి వచ్చాం. రాష్ట్ర ప్రభుత్వ, నేషనల్ హైవేస్ నిధులతో సంబంధం లేకుండా కలెక్టర్ ఖాతాలోని రూ.20 లక్షల నిధులతో కొన్ని పరిష్కార చర్యల్ని చేపట్టి నెలలో పూర్తి చేస్తాం. అలాగే నేషనల్ హైవేస్ వారితో కూడా మాట్లాడాం. పెద్దస్థాయి పనుల్ని వారికి అప్పగించి, రెండు మూడు నెలల్లో ఆ పనుల్ని కూడా పూర్తి చేస్తాం.

25 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాం

గత నాలుగు సంవత్సరాల్లో జిల్లాలో సంభవించిన రోడ్డు ప్రమాదాల్ని పరిశీలిస్తే సగటున రోజుకొకరు మరణిస్తున్నారు.ఏటా ఏడువందలకుపైగా ప్రమాదాలు జరుగుతుంటే, సగటున 350 మంది మరణిస్తున్నారు.ఇప్పటికే 25 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. మరింత లోతుగా అధ్యయనం చేసి ప్రమాదాల నివారణకు పరిష్కార మార్గాలు కనుక్కుంటాం.

20న బంగారుపాళ్యానికి మంత్రి లోకేష్ రాక

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 17: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ 20వ తేదీన బంగారుపాళ్యం రానున్నారు.బంగారుపాళ్యం ఆస్పత్రిలో ఏర్పాటు చేయించిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తొలుత 19న లోకేష్ పర్యటన వుంటుందని ప్రచారం జరిగింది.చివరకు 20వ తేదీకి పర్యటన ఖరారైంది.

వాన కోసం ....!

వానెప్పుడొస్తుందో తెలుసుకునేందుకు సోమల మండలం కరకమంద గ్రామంలో మంగళ వారం రాత్రి గ్రామస్తులు కడవ శాస్త్రం చూశారు.కుమ్మరి ఇంటి నుంచి కొత్త కడవ, కర్రి కుటుంబీకుల ఇంటి నుంచి వరిధాన్యం గ్రామ చావడి వద్దకు చేర్చారు.ఆలయాల నుంచి విభూదిని తీసుకొచ్చారు. నడివీధిలో వరిధాన్యాన్ని రాశిగా పోసి దానిపై కొత్త కడవకు పూలు అలంకరించి పూజలు చేశారు. కడవ నిండా నీళ్లు నింపారు. గంగమ్మ దేవతను ఆరాధిస్తూ స్నానం చేసిన ముగ్గురు పెళ్లి కాని యువకులు ఆ కుండను మూడు వైపులా పట్టుకున్నారు. వర్షం పడుతుందా లేదా గంగమ్మతల్లీ అంటూ కార్తెల పేర్లను గ్రామస్తులు పలకడం ప్రారంభించారు.ఉత్తర కార్తె అని చెప్పినప్పుడు కడవలో కదలికలు లేవు. రాబోయే కార్తెలో అయినా వర్షం పడుతుందా అనగానే కడవ గిర్రని తిరగడం గమనించారు.ఈ కార్తెలో వర్షాలు లేకపోవడంతో చివరకు వలస పూజలు చేయాలని నిర్ణయించుకున్నారు.

\- సోమల



రేపట్నుంచే ఇసుక కొత్త పాలసీ

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 17: ఉచిత ఇసుక పాలసీలో భాగంగా రవాణా ఛార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం నుంచి జిల్లాలో అమలు కానున్న ధరలపై మంగళవారం జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారుల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అంతకు ముందు ఇసుక విధానం అమలుపై జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయంలో డీడీ ప్రసాద్, జియాలజిస్టు పోలిరెడ్డి ఆధ్వర్యంలో సుదీర్ఘంగా సమీక్షించారు.వైసీపీ పాలనలో ట్రాక్టర్ ఇసుక 10 కిలో మీటర్ల దూరానికి రూ.3500 నుంచి రూ.4వేలు పలికేది. కొత్త ఇసుక పాలసీలో వెయ్యి రూపాయల లోపే లభ్యం కానుంది.

రెండు స్టాక్ పాయింట్లు : చిత్తూరు రూరల్ మండలంలోని పాలూరు, దిగువమాసాపల్లి స్టాక్ పాయింట్లలో మాత్రమే ఇసుక లభ్యమవుతుంది. దిగువమాసాపల్లిలో ప్రస్తుతం 91,126 మెట్రిక్ టన్నులు, పాలూరులో 9382 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ వుంది. బైరెడ్డిపల్లి మండలంలోని స్టాక్ యార్డును గనుల శాఖ అధికారులు తొలగించారు.



ఇసుక విధానం అమలుపై సమీక్షిస్తున్న మైన్స్ అధికారులు

సచివాలయాల్లోనే నమోదు : ఇసుక కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో మాత్రమే నమోదు చేసుకోవాల్సి ఉంది.ఆయా కేంద్రాల పరిధిలో ఇసుక రవాణాకు సంబంధించి అనుమతులు, ట్రాక్టర్ల వివరాలు అవసరమైన వారికి అందిస్తారు.

ఇసుక ధరలు : ట్రాక్టర్ (4.5 టన్నులు) ఇసుక రవాణా చార్జీలతో కలిపి స్టాక్ పాయింట్ నుంచి 10 కిలో మీటర్ల దూరానికైతే 607రూపాయలు చెల్లించాలి. 20 కి.మీ దూరానికి రూ.1152, 30 కి.మీ దూరానికి రూ.1728, 40 కి.మీ దూరానికి రూ.2304 చెల్లించాలి.6టైర్ల టిప్పర్ (10 టన్నులు) ఇసుక రవాణా చార్జీలతో కలిపి 10 కి.మీ దూరానికి రూ.1070, 20 కి.మీ దూరానికి రూ.2040, 30 కి.మీ దూరానికి రూ.3060, 40 కి.మీ దూరానికి రూ.4080 చెల్లించాల్సి వుంటుంది.

ఇసుక వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి

ఇసుక రవాణాదారులందరూ తమ వాహనాలకు జీపీఎస్ అమర్చుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వినియోగదారుడికి ఇసుక సకాలంలో సరఫరా చేయకుంటే వాహన యజమానులకు జరిమానా విధించే అవకాశముంది.



పుస్తకావిష్కరణ చేస్తున్న ఎంపీ, తదితరులు

యువతకు ప్రధాని మోదీ ఆదర్శం

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 17: యువతకు ప్రధాని మోదీ ఆదర్శమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. జనజాగృతి స్వచ్ఛంద సంస్థ, బీజేపీ నాయకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక నాగయ్యకళాక్షేత్రంలో మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మోదీ జీవితాన్ని ప్రతిబింబిస్తూ ముద్రించిన భవిష్య మార్గ దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన మోదీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడన్నారు. లక్ష్యాన్ని చేరుకోడానికి స్థాయి అడ్డురాదని, పట్టుదల, కృషితోనే గమ్యం చేరుకోగలమన్నారు. పరిశీలకులుగా బీజేపీ అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ శంకర్, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, గురజాల చెన్న కేశవ నాయుడు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోండి

వేదంలో పట్టభద్రులైన బ్రాహ్మణ యువతకు సూచన

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 17: వేదంలో పట్టభద్రులై నిరుద్యోగులుగా ఉన్న బ్రాహ్మణ యువతకు ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ.4వేలు మంజూరు చేయనున్నారని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. దీనికోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 81258 87381, 90301 50900 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పర్యాటక ఎక్సలెన్స్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, సెప్టెంబరు 17: పర్యాటక ఎక్సలెన్స్ పురస్కారాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా పర్యాటక అధికారి మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న జరిగే ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన టూర్స్ ట్రావెల్స్ హోటల్, ప్రభుత్వ సంస్థల వారు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోగా సమర్పించాలన్నారు. వివరాలకు www.tourism.ap.gov.in సంప్రదించాలని కోరారు.

రేషన్ 20వ తేదీదాకా తీసుకోవచ్చు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 17: విజయవాడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రేషన్ పంపిణీ గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను మంగళవారం జారీచేసింది. ఇంత వరకు 87.56 శాతం రేషన్ పంపిణీ జిల్లాలో కొనసాగింది. మిగిలినవారు పెంచిన గడువును దృష్టిలో ఉంచుకుని రేషన్ పొందాలని డీఎస్వో శంకరన్ సూచించారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు ఈనెల 18వ తేదీనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎం రాము ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో అక్టోబరు మూడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టులకు జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 91542 91408 నెంబరును సంప్రదించాలన్నారు.

మిద్దెపై నుంచి పడి కార్పెంటర్ మృతి



మరణించిన కార్పెంటర్ జయవేలు

పలమనేరు, సెప్టెంబరు17 : ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి పడి ఓ కార్పెంటర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మున్సిపాలిటీలోని గంటా వూరు లో నివాసమున్న జయవేలు (51) కార్పెంటర్. ఇతడు మంగళవారం కాలువపల్లిలో పని చేసేందుకు వెళ్లాడు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటి మిద్దెపైన పనిచేస్తూ ప్రమాద వశాత్తు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.వంద ఇస్తేనే మస్టర్ వేస్తా

ఉపాధి కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ మాటల వీడియో వైరల్



కూలీలను బెదిరిస్తున్న మాధవ్

నాగలాపురం, సెప్టెంబరు 17: ఉపాధి పనులు కావాలన్నా.. బిల్లులు మంజూరు చేయాలన్నా కార్డుకు రూ.వంద కట్టాల్సిందే.. లేకపోతే మస్టర్ ఆపేస్తాం.. కూలి డబ్బు రాదు..' అంటూ మండలంలోని ఎస్‌ఎస్‌పురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మాధవ్ కూలీలను బెదిరిస్తున్న వీడియో ఒకటి వైరల్ అవుతోంది. పై అధికారులు డబ్బు వచ్చిందా అని ఒత్తిడి చేస్తున్నారు.. వారికి నేను ఏమి సమాధానం చెప్పాలి' అంటూ ఆ వీడియోలో హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ గ్రామ పంచాయతీలో దాదాపు 500 జాబ్ కార్డులున్నాయి. వారానికి ఒక్కొక్క కార్డుకు రూ.100 చొప్పున మాధవ్ వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు దాదాపు రూ.2లక్షలు వసూలు చేస్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. తమకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, డబ్బు ఇచ్చుకోలేమని చెప్పిన కూలీలను పనులు ఇచ్చేది లేదని, మస్టర్ ఆపేస్తానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మండలంలో తరచూ జరుగుతున్నా సంబంధిత ఏపీవో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వంట నూనెల దుకాణాల్లో సోదాలు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరత సృష్టిస్తుండడంపై అధికారులు దృష్టి సారించారు. నాలుగు టీములుగా ఏర్పడి తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరులలో సోదాలు చేశారు. అధిక ధరకు విక్రయిస్తున్న, నోస్టాక్ బోర్డు పెట్టిన 10 దుకాణాలపై కేసులు నమోదు చేశారు.





అధికారనంది వాహనంపై విహరిస్తున్న వరసిద్ధుడు - ఆస్థాన మండపంలో నృత్యం చేస్తున్న కళాకారులు

అధికార నంది వాహనంపై వరసిద్ధుడి విహారం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వరసిద్ధుడికి అధికార నంది వాహన సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన వళ్లవర్ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ప్రధాన ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో అలంకార మండపం వద్ద స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పూజలు జరిగాయి. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామిని అధికారనంది వాహనంపై అధిష్ఠింపజేసి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఆస్థాన మండపంలో కళాకారుల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్‌రవి ఉభయదారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం వరసిద్ధుడికి రావణబ్రహ్మ వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పపల్లె, సిద్ధంపల్లె, ముద్దురామాపురం గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.





వరదరాజస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు - శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామికి నిర్వహిస్తున్న పున్నమి గరుడ సేవ

కాణిపాకంలో వైభవంగా పున్నమి గరుడ సేవ

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని వరదరాజస్వామి ఆలయంలో మంగళవారం పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంగాలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి పాల్గొన్నారు.

అన్నదానానికి 2.5 టన్నుల కూరగాయల వితరణ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన గంగాధర్ మంగళవారం 2.5 టన్నులు 12 రకాల కూరగాయలను అధికారులకు అందించారు. విరాళదాతకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అలాగే అన్నదాన కార్యక్రమానికి ఒంగోలుకు చెందిన ప్రత్యూష రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, మునిరామయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్వామివారిని కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు.





కూరగాయలు అందజేస్తున్న గంగాధర్ - రూ.లక్ష విరాళంగా అందిస్తున్న ప్రత్యూష

రెవెన్యూ మాయాజాలంతో నకిలీ రిజిస్ట్రేషన్

లబోదిబోమంటున్న జక్కిదొనవాసి



నకిలీ రిజిస్ట్రేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న బాధితుడు

పాకాల, సెప్టెంబరు 17: రెవెన్యూ అధికారుల మాయాజాలం, దళారుల జిమ్మిక్కులతో పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల ఓ అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న బాధితుడు లబోదిబోమంటూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని మంగళవారం అధికారులను నిలదీశాడు. బాధితుడి వివరాల మేరకు... వెదురుకుప్పం మండలం జక్కిదొన రెవెన్యూ గంటావారిపల్లెకు చెందిన శ్రీపురం దామోదరం రెడ్డి కుటుంబ సభ్యులకు ఆ గ్రామంలో సర్వే నెంబరు 513-16లో 66 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. వీరి అనుభవంలోనే ఉన్న ఆ భూమిలో వరి సాగు చేశారు. ఈ భూమిని ఇటీవల అదే గ్రామానికి చెందిన పుల్లారెడ్డి అనే వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. అతడు మళ్లీ తన కొడుకు పేరుమీద దాన విక్రయం రిజిస్ట్రేషన్ చేశాడు. రెవెన్యూ అధికారుల సహకారంతో 1బి సృష్టించి ఈ తతంగం నడిపించారు. మళ్లీ ఆ సర్వే నెంబర్ విస్తీర్ణం ఆన్‌లైన్‌లో మాయంచేశారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన సీనియర్ అసిస్టెంట్ పెంచల కుమార్ 1బి మేరకు రిజిస్ట్రేషన్ చేసేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడు మంగళవారం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ హేమంత్‌ను నిలదీశాడు. 1బి ఉండటంతో నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేశామని వివరించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు, పూతలపట్టు డాక్యుమెంట్ రైటర్ కృష్ణ, మరి కొందరి ప్రమేయం ఉన్నట్లు బాధితుడు ఆరోపించాడు.







అమ్మవారి ఉత్సవమూర్తికి, విమాన ప్రాకారానికి పవిత్రమాలలు సమర్పిస్తున్న అర్చకులు - పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే నాని దంపతులు

పద్మావతీదేవికి పవిత్రాల సమర్పణ

తిరుచానూరు, సెప్టెంబరు 17: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం సహస్రనామార్చన, నిత్యార్చన తరువాత పవిత్ర సమర్పణ నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, శేషగిరి అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబు స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా తిరుచానూరు పద్మావతి అమ్మవారికి మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధారెడ్డి దంపతులు వందకేజీల కుంకుమను ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి పవిత్రోత్సవాల్లో పాల్గొని పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని ఆలయ అధికారులపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ఆలయ అధికారుల తీరు మాత్రం మారలేదని, వైసీపీ ప్రతినిధులకు ఇప్పటికూడా ఆలయంలో రాచమర్యాదలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ప్రతినిధులు వస్తే పట్టించుకోవడంలేదంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

310 మొబైల్ ఫోన్ల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: రూ.62 లక్షల విలువ చేసే 310 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను మంగళవారం ఎస్పీ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు. ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే మొబైల్ హంట్ లేదా సీఈఐఆర్ పోర్టర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు 10 విడతల్లో రూ.6.07 కోట్ల విలువ చేసే 3,530 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

రికవరీ చేసిన ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు



నులిపురుగుల రహిత సమాజం నిర్మిద్దాం

తొలి రోజే 96.4 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ : ఏడీఎంహెచ్‌వో



విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న వైద్య సిబ్బంది, పక్కన కలెక్టర్, ఎంపీ తదితరులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 17: ఆరోగ్యవంతమైన పిల్లలు, సర్వసమాజం కోసం నులిపురుగుల రహిత సమాజం నిర్మిద్దామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. విద్య, వైద్య శాఖల సమన్వయంతో మంగళవారం చిత్తూరులోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలోని 5,466 అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 3,63,888 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. తొలిరోజున 96.4 శాతం లక్ష్యం పూర్తి చేశామని, మిగిలిన శాతాన్ని 25వ తేదీన పూర్తి చేస్తామన్నారు. డీఐవో డాక్టర్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, డీవైఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపు కుప్పంలో పీజీఆర్‌ఎస్

చిత్తూరు, సెప్టెంబరు 17: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజా సమస్య పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండల, నియోజకవర్గ స్థాయి అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు.

రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధి చేయండి : ఎంపీ మిథున్





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి - బోయకొండ ఆర్చి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చౌడేపల్లె, సెప్టెంబరు 17: ఎన్నికల వరకే రాజకీయం చేయాలని, ఆ తరువాత అభివృద్ధి చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భారీ బందోబస్తు మధ్య వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతే కాదు పుంగనూరు నియోజకవర్గాన్ని సీఎం చంద్రబాబు గుర్తుపెట్టుకుని అభివృద్ధి చేయాలని కోరారు. పుంగనూరు నుంచి రొంపిచెర్ల వరకు ఉన్న నాలుగు లేన్ల రోడ్డును పూర్తిచేయాలన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి నీటిసమస్య పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైసీపీరాష్ట్రకార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు దామోదర్‌రాజు, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మాజీ జడ్పీటీసీ రుక్మిణమ్మ పాల్గొన్నారు.

120 మందితో బందోబస్తు

మిథున్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా 150 మంది పోలీసులతో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 120 మంది కానిస్టేబుళ్లతో చౌడేపల్లె నలువైపులా బందోబస్తు కల్పించారు.

సెక్యూరిటి పెంచుకోవడానికే మిథున్ ఆరాటం : చల్లా బాబు

ఎంపీ మిథున్‌రెడ్డి సెక్యూరిటీ పెంచుకోవటానికే ఆరాటపడుతున్నాడని టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎంపీ పర్యటనను టీడీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే ఆలోచనే లేదని స్పష్టం చేశారు.

వైభవంగా గణనాథుడి నిమజ్జనం



పుంగనూరు రూరల్, సెప్టెంబరు17: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని ఎన్ఎస్‌పేటలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఉదయం విగ్రహం వద్ద ఏర్పాటు లడ్డూను వేలయం వేయగా రూ. 16వేలకు ఓ భక్తుడు దక్కించుకున్నాడు. అనంతరం స్వామివారిని బళ్లారి డ్రమ్ములు, మేళతాళాలు, బాణ సంచాల పేలుళ్ల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. పట్టణ సమీపంలోని పాములకుంటలో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్టీసీ సిబ్బందిచే స్వచ్ఛతా హి సేవ ప్రమాణాలు



మానవహారం చేపట్టిన అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు

పలమనేరు, సెప్టెంబరు17 : పలమనేరులో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా -2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా ర్యాలీ అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకొని అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని చెత్తర హితంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య సిబ్బందికి స్థానికులు సహకరించాలని కోరారు. అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, బీజేపీ పట్టణ కన్వీనర్ తాతయ్యనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వారపు సంత ప్రాంతంలో, బాపూజీ ఉద్యానవనంలో చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు. ఆర్టీసీ డిపోలో డీఎం స్వామి తమ సిబ్బందికి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం గురించి వివరించారు.

కొనసాగుతున్న వరద బాధితుల ఆర్థికసాయం



విశ్వనాథనాయుడుకు నగదును అందిస్తున్న మఠం పంచాయతీ నాయకులు

శాంతిపురం, సెప్టెంబరు: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సహాయం కొనసాగుతోంది. మఠం పంచాయతీ పార్టీ అధ్యక్షుడు జయపాల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కలిసి రూ. 1,11,116లు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడుకు అందించారు. అదేవిధంగా 121పెద్దూరు పంచాయతీ టీడీపీ నేత చంద్రశేఖర్‌రెడ్డి నాయకులతో కలిసి రూ.50వేలు, సి.బండపల్లె పంచాయతీ నాయకులు రూ.10వేలు అందించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, ఏఎంసీ నాగరాజు, రాజారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామప్ప, శ్రీనివాసులు, గంట్లప్ప, తిమ్మరాయప్ప, రవి, మఠం పంచాయతీ సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

శాంతిపురం, సెప్టెంబరు : పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు అన్నారు. మంగళవారం శాంతిపురంలో అధికారులు, టీడీపీ నాయకులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది కలిసి సంపూర్ణ పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహ కూడలిలో మానవహారం చేపట్టారు. గ్రామాల్లో చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ రవినాయక్, యూనిట్ ఇన్‌చార్జి జయారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అశ్వత్‌నారాయణ, కెనమాకులపల్లె సర్పంచ్ జయరాం, ఏఎంసీ నాగరాజు, నారాయణప్ప, మురుగన్, రమేష్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



కుప్పం, సెప్టెంబరు 17: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ మంగళవారం వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.50వేల విలువైన క్రీడా సామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గజన్నాథరావు సిబ్బందితో కలిసి దాతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సలహాదారు ఎ.మహేశ్, డైరెక్టర్లు పీజీ.సెల్వం, సెంథిల్, ప్రసాద్, చరణ్, కృష్ణమూర్తి, జ్యోత్స్న, శిరీష, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతులు మెరుగుపరచండి

రామకుప్పం, సెప్టెంబరు 17: గ్రామాల్లో వసతులు మెరుగుపరచాలని తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ గంట్లప్పగౌడు కోరారు. పంద్యాలమడుగు పంచాయతీలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. పంచాయతీ పాలకులు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రజా వసతుల కల్పనకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



రంజిత్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 17 : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పుంగనూరులో జరిగింది. పట్టణంలోని బజారువీధికి చెందిన రంజిత్(35) ఓ పార్శిల్ సర్వీసులో పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో రంజిత్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు.

స్వచ్ఛత హీ సేవను విజయవంతం చేయండి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 17 : మండలంలో అక్టోబరు 2వతేది వరకు నిర్వహించనున్న స్వచ్ఛత హీ సేవ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజేంద్రబాలాజీ కోరారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అన్ని గ్రామపంచాయతీల్లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. మండలంలో ప్రత్యేక పారిశుధ్య కార్య క్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి, సచివాలయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పాస్టర్ల సాయం



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 17 : బైరెడ్డిపల్లెకు చెందిన చర్చి పాస్టర్లు గుణశేఖర్, శామ్యూల్, తిమ్మోతి, వరప్రసాద్ కొన్నిరకాల ఆహార పదార్థాలను వరదబాధితులకు పంపారు. మంగళవారం బస్సులో వాటిని విజయవాడకు పంపారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 17 : మండలంలోని పెద్దచెల్లారగుంట గ్రామంలో మంగళవారం ఆరోగ్య సంరక్షణపై తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ పాఠశాల విద్యార్థులతో కలసి వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. చేతులశుభ్రత, పరిసరాల శుభ్రత, పోషకాహార ప్రాము ఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీఉన్నత పాఠశాల హెచ్ఎం రవికుమార్, ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జయంతి, ఏఎన్ఎం పాపమ్మ, ఆశా కార్యకర్త లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ పరిధిలో పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణకు వైద్యసిబ్బంది మాత్రలు పంపిణీచేశారు. మండలంలోని కంభంపల్లెలో తీర్థం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నవీన, ఏఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు రామాంజులమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలి

రొంపిచెర్ల, సెప్టెంబరు17: ఉపాధి హామీలో పండ్లతోటల పెంపకానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా అడిషినల్ పీడీ గంగాభవాని సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఏప్రిల్ 23 నుంచి మార్చి 2024 వరకు జరిగిన పనులపై తనిఖీ చేసి వివరాలు వెల్లడించారు. మొత్తం రూ.12వేలు అక్రమాలు జరిగాయని ఆ సొమ్ము రికవరీ చేయాలని ఏపీడీ ఆదేశించారు. అనంతరం ఎంపీ డీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్ఆర్‌పీ బుజ్జీ, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, ఏపీవో బాలమురళి, టీడీపీ నాయకులు ఓబులేశ్వరరెడ్డి, అమరనాథరెడ్డి తదితర టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌గా కిరణ్‌కుమార్



పుంగనూరు రూరల్, సెప్టెంబరు17: పుంగనూరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కిరణ్‌కుమార్‌రెడ్డి స్టాండింగ్ కౌన్సిల్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పాలకవర్గం ఆమోదంతో ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

ఎల్లుండి కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కుప్పం, సెప్టెంబరు 17: కుప్పం మండల సచివాలయంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం తన ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగు తుందని పేర్కొన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని సూచించారు.

వరదబాధితులకు విరాళం



పుంగనూరు రూరల్, సెప్టెంబరు17: పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన వరసిద్ధి వినాయక సేవాసంఘ సభ్యులు విజయవాడ వరదబాధితుల కోసం రూ.11,116లు విరాళాలు సేకరించారు. ఆ నగదును డీడీ రూపంలో తహసీల్దార్ రాముకు మంగళవారం అందించారు.

మైనార్టీలపై ఎంపీది కపటప్రేమ

పుంగనూరు, సెప్టెంబరు17: మైనార్టీలపై రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కపటి ప్రేమ చూపుతున్నారని టీడీపీ మైనార్టీ యువనేత సుహేల్‌బాషా విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ముస్లింల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పడం తప్ప ఆచరణలో లేదన్నారు. పుంగనూరులో ఉర్దూ కళాశాల ఏర్పాటుకు బైపాస్‌రోడ్డులో దాదాపు 1.5 ఎకరాలు భూమి ఇస్తున్నట్లు ప్రకటించి ఇప్పటివరకు కేటాయించలేదన్నారు. ఆ స్థలం ఎక్కడ ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి



పుంగనూరు రూరల్, సెప్టెంబరు17: కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కూటమి నాయకులు మాధవరెడ్డి, విరూపాక్షి పేర్కొన్నారు. వనం- మనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూజగానిపల్లె రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, చైతన్యరాయల్, జయన్న, మహేంద్ర, హరి, గంగిరెడ్డి, మహేశ్, శీన పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి



రంగయ్యనాయుడు

పలమనేరు, సెప్టెంబరు17 : పలమనేరు మాజీ వైస్ ఎంపీపీ రంగయ్యనాయుడు (44) మృతిచెందారు. రామాపురానికి చెందిన ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో వేలూరు సీఎంసీలో చికిత్స పొందు తున్నారు. పరిస్థితి విషమించి మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సంతాపం తెలియజేశారు.

బైక్‌తో యువకుడి ఫీట్లు.. గాయపడ్డ మరో కుటుంబం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు17: పుంగనూరు- పలమనేరు జాతీయ రహదారిలోని తోపుమఠం వద్ద ఓ యువకుడి నిర్లక్ష్యానికి ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. స్థానికు కథనం మేరకు.. పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌కు చెందిన సయ్యద్‌బాషా పలమనేరు వైపు నుంచి ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తూ తోపుమఠం వద్ద ముందు చక్రాన్ని పైకి లేపి ఫీట్లు చేస్తూ ఎదురుగా నక్కబండకు ద్విచక్ర వాహనంలో వెళుతున్న మురళి, అతని భార్య సుల్తానా, కుమారుడు రిహాన్(3)ను ఢీకొన్నాడు. మురళితో పాటు భార్య, కుమారుడు గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పలు ఆస్పత్రుల్లో నర్సులే వైద్యుల అవతారం ఎత్తారు. వచ్చిన రోగులకు చికిత్సలు అందిస్తూ ప్రభుత్వ ఆస్పత్రులంటే ఇంతే అని నిరూపిస్తున్నారు. కొన్నిచోట్ల రాత్రిపూట వైద్యులు ఉండడం లేదు. జూనియర్ నర్సులు తూతూ మంత్రంగా వైద్యం చేస్తూ సీరియస్ కేసులను రెఫర్ చేస్తున్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి విజిట్'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. - పుంగనూరు, సోమల, రొంపిచెర్ల

నర్సులతోనే వైద్యం

ఆంధ్రజ్యోతి విజిట్

డాక్టర్లు లేరు



డాక్టరు రాక ఖాళీగా ఉన్న కుర్చీ

రొంపిచెర్ల, సెప్టెంబరు17: స్థానిక పీహెచ్‌సీ 24 గంటల ఆస్పత్రి. ఇద్దరు వైద్యులు ఉన్నారు. మంగళవారం ఒక్కరు కూడా హాజరు కాలేదు. ఉదయం 9.20 గంటలకు సీహెచ్‌వో కాంతమ్మ, హెచ్‌ఈ రాజేశ్వరి, మహిళా సూపర్‌వైజర్ పంకజాక్షి, హెచ్‌ఏ రెడ్డెప్ప, స్టాఫ్ నర్సు లావణ్య, ఫార్మసిస్టు శ్రీలక్ష్మి, సిబ్బంది శం కరయ్య వచ్చారు. 12 గంటల వరకు 40 మంది రోగులు వచ్చారు. స్టాఫ్‌నర్సు వైద్యం అందించా రు. జ్వరాలతో వచ్చిన వారు ఎక్కువగా ఉన్నారు. డాక్టర్లు వినయ్, డాక్టరు దినేష్‌కుమార్ నాయక్ ఆస్పత్రికి రాలేదు. డాక్టర్ల సమ్మె కారణంగా చలో విజయవాడకు వెళ్లినట్లు హెచ్‌ఈ రాజేశ్వరి తెలిపారు. యుడీసీ నరేష్ ట్రెజరీకి వెళ్లాడని పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ రాలేదు.

ఒక డాక్టరే వైద్యం అందిస్తున్నారు



మందుల కోసం రోగుల ఎదురుచూపు

సోమల: స్థానిక పీహెచ్‌సీలో రాత్రి వేళ వైద్యులు లేకపోవడంతో డ్యూటీలో ఉన్న జూనియర్ నర్సులే వైద్యసేవలు చేస్తున్నా రని రోగులు వాపోయారు. మహిళా డాక్టర్‌ను వైద్య సేవలకు నియమించాలని పలు వురు కోరారు. పీహెచ్‌సీలో మందులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. సమయ పాలన పాటించారు. రాత్రి వేళ ప్రమాదాలు జరిగితే ఇతర వైద్యశాలలకు రెఫర్ చేస్తున్నారు. ఇద్దరు డాక్టర్లను ప్రభుత్వం నియమించినా ఒకరే వైద్యసేవలు అందిస్తున్నారు. మరో డాక్టర్ క్యాంపుకెళ్లాడని సమాధానం ఇచ్చారు. క్యాంపు వివరాలు చెప్పడం లేదు.

పుంగనూరులో హెడ్‌నర్స్ పెత్తనం..!



హెడ్‌నర్సు రూము వద్ద కాపుకాస్తున్న నర్సులు

పుంగనూరు: స్థానిక వంద పడకల ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్ పెత్తనం కొనసాగుతోంది. రోగులు ఉదయం 8గంటల నుంచే వైద్యం కోసం రావడం ప్రారంభమైంది. ఆస్పత్రి హెడ్‌నర్స్ మధుబాల రాగానే ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన నర్సులు, శానిటేషన్ సిబ్బంది, ఉద్యోగులు వెంటనే ఆమె గది వద్దకు వెళ్లి ఆమె బయటకు వచ్చే వరకు వేచి ఉండి నమస్కారం చేసి వెళ్లారు. ఆమె గది వద్ద సిబ్బంది మొత్తం వేచి ఉండగా ఆంధ్రజ్యోతి ఫొటో తీస్తుండగా అనుమతి లేకుండా ఫొటో తీయరాదని అడ్డుకున్నారు. ఉదయం 9గంటలకు ప్రారంభం కావాలసిన ఓపీ 9-20గంటలకు ప్రారంభం కావడంతో రోగులు వైద్య చికిత్సల కోసం క్యూ కట్టారు. డాక్టర్ రామాంజులునాయక్ 8.50 గంటలకు, మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి, డాక్టర్ రాహుల్ 9గంటలకు మిగిలిన డాక్టర్లు ఒక్కొక్కరిగా హాజరయ్యారు. రోగులకు వైద్య పరీక్షలు, చికిత్సలు, మందులు పంపిణీ సజావుగా జరిగింది. ఉదయం నుంచి 12 గంటల వరకు 409మంది రోగులు వచ్చారు. ప్రతి రోజూ 71 మంది ఇన్‌పేషెంట్లు తగ్గకుండా ఉంటున్నట్లు డాక్టర్లు తెలిపారు. అధికంగా జ్వరపీడుతులు వస్తున్నట్లు వివరించారు.

ఆధునిక సాగు విధానాలతో మెరుగైన మార్కెటింగ్

జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి



ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కుప్పం, సెప్టెంబరు 19: ఆధునిక సాగు విధానాల అమలుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించి, తద్వారా మెరుగైన మార్కెటింగ్ చేయడానికి రైతులకు వీలవుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పూలు, కూరగాయలు (హార్టికల్చర్ హబ్)లో ఉద్యాన శాఖ, ఇండో- ఇజ్రాయిల్ సంయుక్త ఆధ్వర్యంలో కూరగాయల్లో అంటు కట్టే విధానంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌లో ఉద్యాన శాఖకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ డిజిటల్ మార్కెటింగ్‌పై గైడ్ చేయాలన్నారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలోని పెద్దబంగారు నత్తం, కమతమూరు, దాసేగానూరు, శెట్టిబల్ల, చెల్డిగానిపల్లె తదితర గ్రామాలలో ఉద్యానాధికారులు, డైరెక్టర్ పర్య టించారు. వివిధ రకాల ఉద్యాన పంటలను, మల్బరీ పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్ట్ అధికారి బ్రహ్మదేవు, ఉద్యాన శాఖ ఏడీ కోటేశ్వరరావు, గుంటూరు ఏఈడీ శ్రీకాంత్, జిల్లాలోని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారులు పాల్గొన్నారు.

పట్టురైతుల ప్రోత్సాహక నగదును పునరుద్ధరించాలి

పలమనేరు: గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పట్టురైతులను ప్రోత్సహించేందుకు కిలో పట్టుగూళ్లకు రూ.50 ప్రోత్సాహకంగా ఇచ్చేవారని దాన్ని తిరిగి పునరుద్ధరించాలని పట్టురైతులు కోరారు. రాష్ట్ర పట్టుపరిశ్రమ శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు మంగళవారం పలమనేరులోని పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. తర్వాత ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు డైరెక్టర్ శ్రీనివాసులును కలిసి ప్రోత్సాహక నగదు అందించాలని కోరారు. అనంతరం గంగవరం మండలంలో పట్టుపురుగుల పెంపకం రైతులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి శోభారాణి, పలమనేరు సెరికల్చర్ ఏడీ కె.కిషోర్‌నాయక్, పట్టుపరిశ్రమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రాధాన్యం



మాట్లాడుతున్న పీఎస్ఎం

కుప్పం, సెప్టెంబరు 17: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్య మిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం 9వ వార్డు పరిధిలోని మోడల్ కాలనీ, తొట్లిగానిపల్లె, మల్దేపల్లి కొత్తూరులలో మంగళవారం జరిగిన వార్డు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపాలిటీ పరిధిలో పక్కా ఇళ్లు, రేషన్ కార్డులు, పారిశుధ్య సమస్య, రోడ్లు, వీధి లైట్లు, తాగునీరు వంటి మౌలిక సమస్యలపై వినతులు అందించవచ్చని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానికంగా శ్మశానం స్థలం కేటాయించాలని, ఇళ్లకు అనుభవ పత్రాలు ఇవ్వాలని వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, సుబ్రమణ్యం, జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, నాగభూషణం, గనిఉల్లా, అల్లాబక్ష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో టీడీపీని బలోపేతం చేయాలి

శాంతిపురం, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. మంగళవారం 121పెద్దూరు పంచాయతీ సచివాలయ ఆవరణలో టీడీపీ కార్యకర్తల సమావేశం యూనిట్ ఇన్‌చార్జి గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఆర్థికంగా ఎదగడానికి అధినేత ప్రణాళికలు చేపడుతున్నారన్నారు. కాగా సమావేశం అనంతరం అభివృద్ధి గురించి అధికారులు చర్చించారు. వెలుగు ద్వారా రుణాలు ఎలా పొందాలో ఏపీఎం గ్రీటా తెలిపారు. ఉపాధి హామీలో ఫారం పాండ్స్, ప్లాంటేషన్ ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో హరినాథ్ తెలిపారు. అనంతరం విశ్వనాథ నాయుడు, ఏఎంసీ నాగరాజును ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, ఈడిగ శివశంకర్ గౌడు, మురుగేష్, బాలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

పలమనేరు, సెప్టెంబరు17 : పలమనేరులో పాఠశాలల్లోని విద్యార్థులందరికీ అధి కారులు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈకార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. పాతపేట యూపీఎస్సీ వైద్యాధికారి ఆశ, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఏఎన్ఎం సుజాత తదితరులు పాల్గొన్నారు. ● దొడ్డిపల్లిలో ఎంఈఓ లీలారాణి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. హెచ్ఎం దేవేంద్ర పాల్గొన్నారు. ● టి.ఒడ్డూరు పాఠశాలలో కొలమాసనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మాత్రలు వేయించారు. హెచ్ఎం కేశవులు, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినం



సోమలలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు, అధ్యాపకులు

సోమల, సెప్టెంబరు 17: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని సోమల జూనియర్ కళాశాల ఆవరణంలో మామిడి మొకలు నాటారు. బీజేపీ లను పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జి మదన్‌మోహన్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు శీలం రామూర్తి పాల్గొన్నారు.

రామకుప్పం: రామకుప్పంలో బీజేపీ జిల్లా నేతలు తులసీనాథ్, రాజసింహా, టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, హరీష్, వెంకటేశ్ ప్రజలకు అన్నదానం చేశారు.

పుంగనూరు రూరల్: స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నానబాల కుమార్, నరసింహులు, పెద్దమఠం బాబు, త్రిమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక బస్టాండులో బీజేపీ మండలాధ్యక్షుడు కడియాల మనోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బీజేపీ నాయకులు గందోడి ప్రవీన్, రత్నయ్య మల్లికరాణి పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పథకం మనకో వరం

కల్లూరు, సెప్టెంబర్ 17: వాటర్ షెడ్ పథకం రైతులకు వరమని వాటర్ షెడ్ అడిషనల్ పీడీ ఉమావాణి తెలిపారు. పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీలో మంగళవారం ప్లాంట్ ఫర్ మదర్ ప్రోగ్రాంలో భాగంగా మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ జల సంపదను సక్రమంగా వినియోగించుకునేందుకు వాటర్ షెడ్ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ పీవో తేజశ్విని, టీవో షబ్బీర్, దొరైరాజ్, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నులిపురుగులతో రక్తహీనత

కుప్పం, సెప్టెంబరు 17: నులిపురుగులు కడుపులో ఉన్నట్లయితే పిల్లలు రక్తహీనత, పోషకాహార లోపంతో బాధపడుతారని వైద్యాధికారులు డాక్టర్ దీప్‌కుమార్, డాక్టర్ సాయి హిమాంత్ అన్నారు. కుప్పం మున్సిపాలిటీ కొత్తపేట యూపీహెచ్‌సీలో మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బందికి పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ సుమిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ఆరోగ్య విస్తరణాధికారి రాజేశ్వరి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈవో శ్రీనివాసులు, సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి ఆరోగ్యకార్యలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీవాణి విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

సదుం: చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి గిరీషా మండల పరిధిలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో, 53 అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, శిఖామణి, సీహెచ్‌వో రషీద్, సర్తాజ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో ఏనుగుల విధ్వంసం



చౌడేపల్లె, సెప్టెంబరు 17: పంట పొలాల్లో ఏనుగులు స్వైర విహారం చేశాయి. సోమవారం రాత్రి మండలంలోని దుర్గసముద్రం సమీపంలోని చారాల సీజేఎఫ్‌కాలనీలోని గంగాధర్‌కు చెందిన ఒకటిన్నర ఎకరం వరి, శ్రీనివాసులు కొబ్బరి చెట్లు, ఎకరం వరి, సుబ్రహ్మణ్యానికి చెందిన ఎకరం వరి, వేరుశెనగ, కొబ్బరి, మామిడి చెట్లు ధ్వంసం చేశాయి. సుమారు రూ.2లక్షలు వరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. వీఆర్‌వో పురుషోత్తం, ఎఫ్‌బీవో రవికుమార్ పొలాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థినులకు మాత్రలు అందజేస్తున్న ఉపకులపతి ఆచార్య దొరస్వామి

గుడుపల్లె, సెప్టెంబరు 17: కుప్పం ద్రావిడ వర్సిటీలో మంగళవారం నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, కులసచివులు ఆచార్యకిరణ్‌కుమార్‌లు విద్యార్థులకు నులిపురుగు నిరోధక మాత్రలను అందజేశారు. అనంతరం వర్సిటీలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య యశోద, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, హరికృష్ణ, కిషోర్, శోభారాణి పాల్గొన్నారు.

సోమల: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించుకోవచ్చునని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, హెచ్ఎం రాధాకృష్ణ, పీహెచ్ఎన్ జయలక్ష్మి, సూపర్‌వైజర్ చంద్రమ్మ, హేమావతి, ఆశా సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు, సెప్టెంబరు 17: ద్విచక్రవాహనాల దొంగను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య మీడియాకు తెలిపారు. రాత్రి సమయాల్లో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి, చర్చివీధి, విమ్సన్ ఎంటర్‌ప్రైజస్, సెబ్ ఆఫీస్ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో రెండో పట్టణ పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి సాంకేతికతను వినియోగించి దర్యాప్తును ప్రారంభించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పోలీసులకు అందిన సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ బాబు, సిబ్బందితో కలిసి న్యూప్రశాంత్‌నగర్ రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి మలుపు వద్ద రాము అనే దొంగను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.3లక్షల విలువ చేసే నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడానికి కృషిచేసిన ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బంది రఫీవుల్లా, సుధీర్‌లను డీఎస్పీ ప్రత్యేకగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

పుస్తకాల వితరణ



పాలసముద్రం, సెప్టెంబరు 17: ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ, పాలసముద్రం, వెంగళరాజు కుప్పం, ఆముదాల, తిరుమల రాజుపురం ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంగళవారం తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొండూరు మోహన్‌రాజు పచ్చనాకు సాక్షిగా, చిన్నబ్బ కథలు అనే పుస్తకాలను వితరణ చేశారు. విద్యార్థులు ఇలాంటి కథల పుస్తకాలు చదవడం వల్ల తెలుగు భాషపై అవగాహన పెరుగుతుందని ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రధానోపాధ్యాయులు రఘు, చక్రధరరావు, ధనరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి రవాణా: సీపీఐఎంఎల్

వెదురుకుప్పం, సెప్టెంబరు 17: వెదురుకుప్పం మండలంలో అక్రమంగా మట్టి రవాణా జరుగుతున్నా రెవెన్యూ చోద్యం చూస్తోందని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం ఆరోపించారు. మంగళవారం వెదురుకుప్పంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని గుంటపొరంబోకు స్థలాలను పూడ్చివేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వి రవాణా చేయడం విచారకరమన్నారు. తహసీల్దార్ పనితీరుపై కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

విశ్వకర్మకు ఘన నివాళి



విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 17: ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తుశిల్పిగా విశ్వకర్మను భావిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జేసీ విద్యాధరి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రబ్బానీ బాషా, డీఆర్డీఏ పీడీ తులసి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, విశ్వకర్మ స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరత్నం రెడ్డి, కోశాధికారి కృష్ణమాచారి, శివకుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు సన్మానం



విజయపురం, సెప్టెంబరు 17: ఇళ్లత్తూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మునిభాస్కర్‌రాజును ఉత్తమ రైతుగా గుర్తించి గ్రోమోర్ యాజమాన్యం మంగళవారం ఎస్‌ఎస్ కండ్రిగలో సత్కరించింది. కొత్త రకాల పంటలు వేయడంతోపాటు తమ ఎరువులను, మందులను వాడి అధిక దిగుబడి సాధించారని ప్రశంసించారు. కంపెనీ యాజమాన్య సిబ్బందులు యువశ్రీ, నవమోహన్, విజయ్, అరవింద్ పాల్గొన్నారు.

అపోలో యూనివర్సిటీలో రోగి భద్రతా దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17: చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో మంగళవారం ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైస్ చాన్సలర్ వినోద్ భట్ మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో రోగి భద్రత చాలా ముఖ్యమన్నారు. ప్రొఫెసర్ అల్ఫ్రెడ్ జే అగస్టిన్, డాక్టర్లు రమ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ని కలిసిన వీడబ్ల్యూఈఎఫ్ నేతలు



చిత్తూరు, సెప్టెంబరు 17: చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను మంగళవారం విలేజ్ వార్డు ఎంప్లాయిస్ ఫెడరేషన్ (వీడబ్ల్యూఈఎఫ్) సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎ.మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర బాబు, డిస్ట్రిక్ అసోసియేట్ ప్రెసిడెంట్ జ్యోతీశ్వర్, ట్రెజరర్ బి.సౌర్యతేజ, ప్రతాప్, పళనితోపాటు అడ్మిన్, ఎడ్యుకేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు. వీరు అంతకుముందు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌ను కూడా కలిశారు.

పెరటాసి మాసం ఆరంభం



అన్నదానం చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 17: పెరటాసి మాసం (తమిళ సంప్రదాయంలో శ్రావణ మాసం) మంగళవారం ప్రారంభమైంది.ఈ సందర్భంగా నగరంలోని ఓం నమో వెంకటేశాయ తరిగొండవెంగమాంబ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో కట్టమంచి ఎల్డీ రఘురామన్ కల్యాణ మండపంలో తమిళ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు ప్రారంభించారు. ట్రస్టు నిర్వాహకులు ఈశ్వర్, వేలు, తిరుకుమరన్ దంపతులు,మల్లిచారి, మురుగన్,గజ,శివ, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు



కుమరేష్ (ఫైల్ ఫొటో)

తవణంపల్లె, సెప్టెంబరు 17: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. తవణంపల్లె దుర్యోధన కాలనీకి చెందిన కుమరేష్ తను ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో వివాహమైందని బాధతో ఇంటి నుంచి సోమవారం వెళ్లిపోయాడు. పరిసర గ్రామాల్లో, బంధువులు ఉన్నచోట్ల వెతికినా కనపడలేదు. దీంతో కుమరేష్ తల్లి మోహనమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు వ్యాసరాయ మఠాధిపతి రాక

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 17: వ్యాసరాయ మఠాధిపతి విద్యా విజయతీర్థ పాదులు గిరింపేట సుగుణేంద్ర తీర్థముల బృందావనానికి బుధవారం రానున్నారు. బుధ, గురువారాల్లో మఠంలో రాఘవేంద్ర స్వామికి సంస్థాన, భిక్ష పూజలు నిర్వహించనున్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందాలని బృందావనం మేనేజర్ కోరారు.

ప్రతి అడుగు.. స్వచ్ఛత వైపు వేద్దాం

• ప్రతిజ్ఞ చేసిన ఉద్యోగులు, నాయకులు





ప్రతిజ్ఞ చేస్తున్న నగరపాలక అధికారులు, ఉద్యోగులు - పూతలపట్టులో ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

చిత్తూరు, సెప్టెంబరు 17: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని.. ప్రతి అడుగు.. స్వచ్ఛత వైపు వేయాలని మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ-2024లో భాగంగా మంగళవారం నగరపాలక కార్యాలయ ఆవరణలో అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, ఎంఈ గోమతి, డీఈ వెంకటప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు పాల్గొన్నారు.

పూతలపట్టు: గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. మంగళవారం పూతలపట్టులో జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతి - చిత్తూరు జాతీయ రహదారి వద్ద మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. గ్రీన్ అంబాసిడర్లకు పారిశుధ్య కిట్లను పంపిణీ చేశారు. జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, టీడీపీ పూతలపట్టు అధ్యక్షుడు దొరబాబు చౌదరి, నాయకులు చంద్రమౌళి, హరి, మునిరాజులు, జయప్రకాష్, మంజునాథ్, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, హెచ్‌ఎం గిరిరాజా, టీచర్లు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థుల ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

ఐరాల(కాణిపాకం): కాణిపాకంలోని వరసిద్ధుడి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ బాలరంగస్వామి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ తిరుమలగిరి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీసీ 1, 2 డిపోల పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. డీఎంలు కృష్ణమూరి, రూపశ్రీ 2డిపో సీఐ అల్తాఫ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'ను విజయవంతం చేద్దాం: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 17: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను విజయవంతం చేద్దామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జేసీ విద్యాధరితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. షెడ్యూలు మేరకు రోజూ స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేయాలని చెప్పారు. ప్రజలు, విద్యార్థులతో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపు



మొక్క నాటి, నీరు పోస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

యాదమరి, సెప్టెంబరు 17: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం మహాసముద్రం సమీపంలోని జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సుమారు వెయ్యి మొక్కలను నాటించి, ప్రతిజ్ఞ చేయించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, ఎన్‌హెచ్ పీడీ కార్తిక్ రెడ్డి, డ్వామా ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఏపీవో బాల, నాయకులు వల్లేరు అమర్‌నాథ నాయుడు, ఎంఎస్ రాజు పాల్గొన్నారు.

విజయపురం: విజయపురం ఉన్నత పాఠశాలలో జరిగిన మోదీ జన్మదిన వేడుకల్లో విద్యార్థులకు స్వీట్లు పంచారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, నాయకులు యుగంధర్‌రాజు, రాము, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోజరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మణివర్మ, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్, మండల అధ్యక్షుడు మురళి, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: సరస్వతి శిశుమందిర్, గాంధీభవన్ వృద్ధాప్య వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు యువరాజు, కుమారరాజు, శాంతన వర్మ, హరి, రామిశెట్టి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో జీడీనెల్లూరు బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, నాయకులు జ్యోతిరెడ్డి, వెంకటేష్ యాదవ్ భాస్కర్, తులసమ్మ, రుక్మిణిమ్మ, సిద్దలింగాచారి, రాధాకృష్ణశెట్టి, గోవిందరాజులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిండ్ర: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. రమేష్, రాంప్రసాద్‌రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వెంకటరమణ, జనసేన నేత జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: ఓంశక్తి ఆలయం ఎదురుగా పార్టీ సభ్యత్వ నమోదుతోపాటు బీజేపీ నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. రమేష్‌నాయుడు, రామ్మూర్తి యాదవ్, మునికృష్ణమనాయుడు, మోహన్, ప్రదీప్, దండపాణి, ప్రకాశ్, వేలాయుధం, శశికళ, కాంచన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం మూత?



వెదురుకుప్పం, సెప్టెంబరు 17: వెదురుకుప్పం మండలం గొడుగుచింత పంచాయతీ కార్యాలయం ఏ సమయంలో తెరుస్తారో.. ఏ సమయంలో మూత వేస్తారో తెలియడం లేదని గ్రామస్థులు మంగళవారం తెలిపారు. పని నిర్ణీత సమయాల్లో తెరవడం లేదన్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, సెప్టెంబరు 17: కేశవపురం, మహావీరపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య విద్యా సామగ్రి వితరణ చేశారు. హెచ్‌ఎం మణి, ఉపాధ్యాయులు సుష్మ, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

దాతల సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్యే ఆరణి



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆరణి శ్రీనివాసులు

గుడిపాల, సెప్టెంబరు 17: గ్రామాల్లో దాతల సేవలు ప్రశంసనీయమని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు అన్నారు. చవటన్ తంగాళ్‌లో కమలాక్షి, చంద్రశేఖర్‌ల జ్ఞాపకార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారి కుటుంబ సభ్యులు ఉచితంగా ఏర్పాటు చేయగా.. మంగళవారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నందీశ్వరాలయంలో పౌర్ణమి పూజలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 17: చవటగుంటలోని ఆవుదేవరనందీశ్వరస్వామికి మంగళవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. మారేపల్లెకి చెందిన పేట రమేష్‌రెడ్డి, మేనక దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

వైభవంగా పౌర్ణమి గిరిప్రదక్షణ



వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 17: గిరింపేట చెంగల్‌రాయకొండలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో మంగళవారం పౌర్ణమి గిరి ప్రదక్షిణ పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పూల రథంపై అధిష్టింపజేసి.. సీబీ రోడ్డు, దర్గా, పలమనేరు రోడ్డు, ఎమ్మెస్సార్ జంక్షన్, రాజీవ్‌గాంధీ రోడ్డు, గిరింపేట, చౌడేశ్వరి ఆలయం మీదుగా గిరి ప్రదక్షిణతో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఈవో వెంకటసుబ్బారెడ్డి, ఉత్సవ ధర్మకర్తలు పూల సుబ్రహ్మణ్యం నాయుడు, కార్పొరేటర్ ఇందులతతోపాటు ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. మంగళవారం గిరింపేట దుర్గాంబ ఆలయంలో ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పలు శివాయాల్లోనూ పౌర్ణమి పూజలు జరిగాయి.

పులిగుండులోనూ..



శేష వాహనంపై ఆది దంపతులు

పెనుమూరు: పౌర్ణమిని పురస్కరించుకుని పులిగుండు శివాలయంలో మంగళవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి వారికి అభిషేకాలు చేశారు. పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల గురునాథీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం, సెప్టెంబరు 17: రాసపాళ్యం (శ్రీ బొమ్మరాజపురం)లోని బాల గురునాథీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలవాసులతోపాటు తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో రామనాథరెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ హేమలత పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

గుడిపాల: చవటన్‌తంగాళ్, కట్టకిందపల్లిలోని గంగమ్మ గుడి, 197 రామాపురంలోని వీరబ్రహ్మంగారి గుడి, పల్లూరు మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోజాకు సన్మానం

నిండ్ర, సెప్టెంబరు 17: వైసీపీ అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి ఆర్కే రోజాను నిండ్ర మండల వైసీపీ నాయకులు సన్మానించారు. ఎంపీపీ దీప, నాయకులు శ్యాంలాల్, మునికృష్ణారెడ్డి, బాబురెడ్డి, వీరయ్యనాయుడు, లక్ష్మీపతి, పోలీస్ శివయ్య సుబ్రహ్మణ్యం యాదవ్, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 17: మోదీ జన్మదినం సందర్భంగా నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం అధ్యతన 37వ డివిజన్‌లో మంగళవారం ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటాలి

వెదురుకుప్పం, సెప్టెంబరు 17: అమ్మ పేరుతో ప్రతి ఒకరూ ఒక మొక్క నాటి, సంరక్షించాలని వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాలలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



నగరి, సెప్టెంబరు17: నగరి కుశస్థలీ నదిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ రవికుమార్‌కు అప్పగించారు. ఆయన పరిశీలించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేల అపరాధం వేసినట్లు తెలిపారు. రీచ్‌లేనిచోట ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేదిలేదని సీఐ, తహసీల్దార్ వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు.

విశ్వకర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 17: పిళ్లారిగుడి వీధిలోని విశ్వకర్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రహ్మ పంచలోహ విగ్రహమూర్తికి ప్రత్యేక అభిషేకం చేశారు. సంఘం అధ్యక్షుడు శరవణాచ్చారి, రవి , గణేశ్, చంద్రశేఖర్, కృష్ణామాచారి, ఆనందచారి, మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

కృష్ణవేణి కళాశాల వద్ద..



చిత్తూరు: విశ్వకర్మ జయంతి సందర్భంగా కృష్ణవేణి కళాశాల వద్ద గల కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. సభ్యులు చంద్ర ఆచ్చారి, మోహన్ ఆచ్చారి, చంద్రశేఖర్, కుమరేష్, పునీత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మిలాద్ ఉన్ నబీ పండుగ



అసార్‌వీధిలోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 17: నగరంలోని ముస్లింలు రెండ్రోజులుగా మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జయంతి) పండుగను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అసార్ వీధి మసీదులను ప్రవక్త కేశాలను సోమ, మంగళవారాల్లో దర్శించుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ప్రవక్త కేశాలను బజారు వీధి చిన్న మసీదులో భద్రపరచడంతో పండుగను ముగించారు. అత్తుభాయ్, రియాజ్, సిరాజ్, అన్సర్‌తోపాటు ముస్లిం మత గురువులు, ప్రభుత్వ ఖాజీలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సాయి వివేకానంద కళాశాల, నారాయణ పాఠశాల సిబ్బంది

నగరి, సెప్టెంబరు17: ఇటీవల అన్నవరంలో జరిగిన అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులైన స్టార్ ఆఫ్ ఆంధ్ర సాధించిన కేసీ తేజేష్, క్రీడాకారుడు ఇగ్నాస్‌లను సాయి వివేకానంద కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు. అలాగే నారాయణ పాఠశాలకు చెందిన రక్షణ్, లక్ష్మీనరసింహ కూడా బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపడటంతో వారిని ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వంట నూనెల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 17: చిత్తూరు నగరంలోని పలు వంటనూనెల అమ్మకాల రీటైల్, హోల్‌సేల్ దుకాణాలు, సూపర్‌మార్కెట్లపై మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. వంటనూనెల అమ్మకాలపై కేంద్రప్రభుత్వం కస్టమ్స్ సుంకం విధించిన నేపథ్యంలో పలు హోల్‌సేల్, రీటైల్ దుకాణదారులు అధిక ధరలకు వంటనూనెలు అమ్మకాలు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. దీంతో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, తూనికలు కొలతలు అధికారి దివ్య తమ సిబ్బందితో కలిసి నగరంలో దాడులు జరిపారు. శేషాపిరాన్, చర్చివీధుల్లో ఎమ్మార్పీకంటేమించి అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించిన దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. పెనాల్టీరూపంలో రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేశారు. పామోలిన్, ఇతర వంటనూనెలను అక్రమంగా నిల్వచేసి, అధిక ధరలకు అమ్మకాలు చేస్తే, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్కూల్ కాంప్లెక్స్ కుదింపుపై కసరత్తు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 17: విద్యావ్యవస్థలో మార్పులు, సంస్కరణల్లో భాగంగా స్కూల్ కాంప్లెక్స్ విధానం అమలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న 250 స్కూల్ కాంప్లెక్స్ సంఖ్యను 170కి కుదించారు. ఈ సంఖ్యను 145కు తెచ్చేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. దీనిద్వారా సెకండ్ హెచ్‌ఎంలు తొలగించి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అధికారాలు ఇవ్వనున్నారు. దీనిపై మంగళవారం విద్యాశాఖ సమావేశ మందిరంలో సాంకేతిక నిపుణులు కసరత్తు చేస్తున్నారు.

పాస్టర్ జాన్ మృతి



బంగారుపాళ్యం, సెప్టెంబరు 17: ముంగరమడుగు గ్రామానికి చెందిన పాస్టర్ జాన్ (79) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఈయన 45 సంవత్సరాలుగా సువార్త చెబుతున్నారు. ఆయన మృతదేహాన్ని పలువురు పలువురు పాస్టర్లు సందర్శించి, నివాళి అర్పించారు. బుధవారం అంతిమసంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పాలసముద్రం, సెప్టెంబరు 17: జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యులు మోహన్‌కృష్ణ, లోకేష్, ఎంపీడీవో రామనాథరెడ్డి పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: అగరమంగళం స్కూల్లోని విద్యార్థులకు వైద్య సిబ్బంది, హెచ్‌ఎంలు, టీచర్లతో కలిసి ఎంఈవో కాణిపాకం ఆంజినేయులుశెట్టి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

వెదురుకుప్పం: మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంఎల్‌హెచ్‌పీ హిమసాగరి, హెల్త్ అసిస్టెంట్ పి.కృష్ణారెడ్డి, ఏఎన్‌ఎం ఎర్రసానమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి,ఈవోపీఆర్డీ సురేంద్రకుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో హెడ్సన్ బాషా, హెచ్‌ఎం ఖాతుంబీ పాల్గొన్నారు.

తవణంపల్లె: అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈవో త్యాగరాజులురెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: పీహెచ్‌సీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రవీణ, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, ఏఎన్‌ఎంలు విష్ణు, దేవి, చరిత, విజయ, ఫర్జానా తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పండ్లు, రొట్టెల పంపిణీ



వెదురుకుప్పం, సెప్టెంబరు 17: మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం వెదురుకుప్పంలో కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. పచ్చికాపల్లం పీహెచ్‌సీలో రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బోడిరెడ్డి హనుమంతరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఎస్.సుజాత, నాయకులు విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.